తాళ్ళపాక తిమ్మక్క

# సుభద్రా కల్యాణం

చేమకూర వేంకటకవి

# విజయ విలాసం

ఒక పరిశీలన





వి.రాజ్యలక్ష్మి

తాళ్ళపాక తిమ్మక్క సుభద్రాకల్యాణం - చేమకూర వేంకటకవి విజయవిలాసం - ఒక పరిశీలన - వి.రాజ్యలక్ష్మి



నీలమేఘ శ్యాము - నిఖిలాభిరాము
లాలిత శుభగాత్రు - లక్ష్మీ కళత్రు
ఆ కంజదళ నేత్రు - నలరి సేవింప
నా కోర్కెలెల్లగ్ర - న్నన సమకూడు

- తాళ్ళపాక తిమ్మక్క

# తాళ్ళపాక తిమ్మక్క - సుభద్రాకల్యాణం
# చేమకూర వేంకటకవి - విజయవిలాసం
# ఒక పరిశీలన

శ్రీమద్రామయణ, భారత, భాగవతాది పురాణేతిహాసాలు భారతీయ సంస్కృతికి మూలస్తంభాలు. అందులోనూ మహాభారతం నవరసభరితమైన ఆఖ్యాన, ఉపాఖ్యానాలకు అక్షయపాత్ర వంటిది. భారతంలోని ప్రతి చిన్న ఘట్టం కావ్య వస్తువుగా, భిన్న ప్రక్రియల ద్వారా కవుల కల్పనలతో సాహిత్యానికి పరిపుష్టిని చేకూర్చాయి.

మహాభారత కథలో సుభద్రార్జునుల వివాహం ఒక రసవత్తర ఘట్టం. నియమానుసారం తీర్థయాత్రకు బయలుదేరిన అర్జునుడు ఉలూచి, చిత్రాంగత, సుభద్రలను వివాహమాడి తిరిగి రావడాన్ని కావ్యవస్తువుగా స్వీకరించిన ఇద్దరు కవులు గేయకావ్యంగానూ, ప్రబంధంగానూ రచించి సాహిత్యచరిత్రలో ఘనకీర్తి పొందారు.

మధ్యయుగానికీ, మధ్యతరగతికి చెందిన తాళ్ళపాక తిమ్మక్క 'సుభద్రాకల్యాణ' మనే పేర ద్విపద గేయకావ్యంగా రచించి తొలి తెలుగు కవయిత్రిగా సాహిత్యపీఠాన్ని అధిష్టించింది. దక్షిణాంధ్రయుగానికి చెందిన తంజావూరు ఆస్థానకవి చేమకూర వేంకటకవి 'విజయవిలాస' మనే పేర ఈ ఘట్టాన్ని శృంగార రసవత్ప్రబంధంగా రచించి క్షీణయుగంలోనూ ప్రసిద్ధుడై సాహిత్యచరిత్రలో ఒక ప్రత్యేక స్థానం పొందాడు.

ఇతివృత్తం ఒకటే అయినప్పటికీ వస్తువైవిధ్యం ఈ రెండు కావ్యాలలోనూ కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. తాళ్ళపాక అన్నమాచార్యుని మొదటి భార్యగా తిమ్మక్క 15వ శతాబ్దానికి చెందిన సామాన్య గృహిణి. చేమకూర వేంకటకవి 17వ శతాబ్దానికి చెందిన తంజావూరు రఘునాథరాయల ఆస్థానకవిగా సంపన్న కుటుంబానికి చెందిన వాడు.

దాదాపు రెండు వందల సంవత్సరాల అంతరం ఉన్న వీరిలో ఒకరు స్త్రీ, మరొకరు పురుషుడు. అన్నింటిలోనూ భిన్నంగా కనిపించే వీరి కావ్య రచనలోని ప్రత్యేకతను వివరించడం ఈ సిద్ధాంతగ్రంథం యొక్క ముఖ్యోద్దేశం.

తిమ్మక్క ఆనాటి బహుభార్యాత్వమనే సాంఘీక దురన్యాయానికి బలియై, తన ఆవేదనను పదిమందితో పంచుకోవాలన్న తపనతో సుభద్రాకల్యాణ గేయకావ్యాన్ని రచించింది. మంజరీ ద్విపదలో స్త్రీలు పాడుకునే విధంగా చెప్పుకుంటూ, పురుషుడు ఒక భార్య ఉండగా, మరికొందరిని వివాహమాడి నపుడు, కారణమేదైనా, మొదటి భార్య ఎంతటి తీవ్ర మనస్థాపానికి గురవుతుందో, ఆమె మానసిక సంఘర్షణ ఎలా ఉంటుందో, అత్యంత సహజంగా తిమ్మక్క కావ్యరూపంలో వివరించింది. తాళ్ళపాక అన్నమయ్యకు ఇద్దరు భార్యలని చరిత్ర చెబుతుంది. మొదటిభార్య తిమ్మక్క తన భర్త మరొక స్త్రీని పెళ్ళాడి ఇంటికి తీసుకు వచ్చినపుడు కలిగిన మానసిక వేదన సుభద్రాకల్యాణంలో ప్రధానాంశంగా గోచరిస్తుంది. ఈ గేయకావ్యం మౌఖికంగా ప్రసిద్ధి పొందినట్లు చెప్పుకుంటారు.

ఇక వేంకటకవి సకల విలాసాలకు, భోగభాగ్యాలకు ఆలవాలమైన తంజావూరు ఆస్థానకవిగా, రాజ కుటుంబీకుడిగా, జీవించిన వాడు. ఆ కాలంలోని రాజులకు, ఉన్నత వర్గాల వారికి స్త్రీ ఒక విలాస వస్తువు మాత్రమే. ఎక్కువ మంది స్త్రీలను వివాహం చేసుకోవడం వారి సామాజిక అంతస్థును పెంచుతుంది.

రసిక శేఖరుడైన రఘునాథరాయలను మెప్పించి ఆనందింప జేయాలని వేంకటకవి, అర్జునుడు ముగ్గురు కన్యలను చేపట్టడం ఒక విలాసమైన చర్యగా పేర్కొంటూ, అష్టాదశ వర్ణనలు ఆనాటి రాజుల వైభవాలను స్వయంగా చూసి, అనుభవించి, విజయవిలాస మనే శృంగారరస ప్రధానమైన ప్రబంధాన్ని రచించి, ప్రభువుకు అంకితమిచ్చి, రాజగౌరవం పొందినవాడు.

మహాభారతం నుండి స్వీకరించిన ఇతివృత్తాన్ని ఈ ఇరువురూ కూడా అతి సులభశైలిలో, విసిగించి పొడిగించకుండా అతి వేగంగా కథను నడిపించారు.

తిమ్మక్క శైలిలో సహజమైన తెలుగు పలుకుబడులు, జాతీయాలు, సామెతలు, వర్ణనలు, వీటితోపాటు శ్రీకృష్ణుని పట్ల ఈమెకు గల అపారభక్తి ప్రతి సన్నివేశంలోనూ గోచరిస్తుంది.

యమక చక్రవర్తిగా పేరు పొందిన వేంకటకవి కావ్యంలో అడుగడుగునా శ్లేష, యమక, అతిశయోక్తి అలంకారాలు, తెలుగు నుడికారాలు, జాతీయాలు, పలుకుబడులు, సామెతలు, వర్ణనలు, ఆడంబరమైన వేడుకలు కోకొల్లలుగా కనిపిస్తాయి.

తిమ్మక్క సుభద్ర ఎంతో అమాయకమైన తెలుగింటి ఆడబడుచుగా, గారాల చెల్లిగా, అందాల భరిణగా, ముగ్ధగా ఆకట్టుకుంటే, ద్రౌపది బాధ్యతలు, ఆప్యాయతా కలబోసిన గృహిణిగా దీర్ఘదర్శిగా, సహనానికి, సౌశీల్యానికి ప్రతీకయైన పరిపూర్ణ స్త్రీగా చెరగని ముద్రవేస్తుంది.

వేంకటకవి విజయవిలాసంలోని కథానాయకుడు సరస సంభాషణా చతురుడు, పరాక్రమశాలి, చమత్కారియైన అర్జునుడు కావ్యాంతం దర్శనమిస్తాడు. ఇతని కావ్యనాయికలు ముగ్ధ మనోహరమైన సౌందర్య రాశులైనా, ఎటువంటి మానసిక భావోద్రేకాలు లేని గాజుబొమ్మలుగా, అలంకార ప్రాయులుగా ఉంటారు.

ఈ రెండు కావ్యాల మధ్యగల స్పష్టమైన వ్యత్యాసాలను ప్రతీసన్నివేశంలోనూ విపులీకరించి చూపుతుంది ఈ సిద్ధాంతగ్రంథం.